

గృహ కార్మికులకు గుర్తింపేదీ?

- దుర్భర స్థితిలో ఇంటి పనివారు
- అమలు కాని జీవో నెంబరు 60
- మహబూబ్‌నగర్, వనపర్తిలలోనే అధికం
- నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

7

బిల్లులు ఇవ్వకుంటే..
మధ్యాహ్నం బంద్

- ఈ నెల 18 లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- లేదంటే వంట చేయబోమంటున్న ఏజెన్సీ నిర్వాహకులు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు ఈ నెల 18లోపు చెల్లించాలని, లేదంటే వంట చేయబోమని నిర్వాహకులు అంటున్నారు. జిల్లాలో 463 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 59,760 మంది విద్యార్థులకు గాను రోజుకు 50 వేల మంది భోజనం చేస్తున్నట్లు అంచనా ఉంది. భోజనం కోసం రోజుకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వంట చేస్తున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

పెండింగ్ ఇలా..

- ఉన్నత పాఠశాలలకు సంబంధించి తొమ్మిది, పది తరగతులకు అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు ఏడు నెలలు బిల్లులు పెండింగ్ ఉన్నాయి.
- ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- కోడి గుడ్ల బిల్లులు ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు గత ఏడాదిలో ఐదు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

త్వరలో చెల్లిస్తాం

ఒకటి నుంచి 8వ తరగతి వరకు పెండింగ్ బిల్లులు రూ.కోటీ 80 లక్షలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వాటిని త్వరలోనే చెల్లిస్తామని అంటున్నారు. తొమ్మిది, పదో తరగతికి సంబంధించి సెప్టెంబరు నుంచి ఏప్రిల్ వరకు రూ.కోటీ 37 లక్షలు నిధులు రాగా, అవి ఈకుబేర్‌లో ఉన్నాయని, త్వరలోనే విడుదల అవుతాయని చెబుతున్నారు. గుడ్ల బిల్లులకు సంబంధించి పాత బడ్జెట్ ముగియడంతో కొత్త బడ్జెట్ వచ్చిన తర్వాత రూ.74 లక్షలు వస్తాయని అంటున్నారు.

నిర్వాహకుల వేతనాలూ పెండింగ్

వంట ఏజెన్సీ నిర్వాహకుల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం నుంచి ఇచ్చే రూ.వెయ్యి అందుతున్నా, రాష్ట్రం నుంచి ఇచ్చే రూ.2 వేల వేతనం పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,295 మంది వంట నిర్వాహకులు ఉన్నారు. వారికి కేంద్రం నుంచి మార్చి, జూన్ నెలలకు కలిపి ఒక నెల వేతనం రూ.12 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఆరు నెలల వేనతం రూ.2 కోట్లా 10 లక్షలు ఈక్యుబేర్‌లో ఉన్నాయని, త్వరలో చెల్లిస్తామని అధికారులు అంటున్నారు.


దామరగిద్ద మండలం లోకుర్తి పాఠశాలలో వంట చేస్తున్న కార్మికులు(ఫైల్)


పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డీఈవో గోవిందరాజులుకు వినతి ప్రతం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు(ఫైల్)


నారాయణపేట మండలం జాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం వడ్డింపును పర్యవేక్షిస్తున్న ఎంఈవో బాలాజీ(ఫైల్)

19 నుంచి వంట బంద్



పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం బిల్లులు ఈ నెల 18లోపు చెల్లించకపోతే 19 తర్వాత పాఠశాలల్లో వంట చేయబోము. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 14 నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. తొమ్మిది, పదో తరగతులకు సంబంధించి వంట బిల్లులు 9 నెలలవి ఇవ్వాల్సి ఉంది.

- వెంకటమ్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, నారాయణపేట

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం, కోడి గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి. వంట ఏజెన్సీలపై అధికారులు, పాలకుల వేధింపులు ఆపాలి.

- బాల్‌రామ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, నారాయణపేట

14 ప్లాంట్ల ద్వారా
శుద్ధ జలాల పంపిణీ

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జగన్ మోహన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జగన్‌మోహన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని 14 తాగునీటి ప్లాంట్ల ద్వారా శుద్ధ జలాలను 2,639 గ్రామాలకు సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హచ్ జగన్ మోహన్ తెలిపారు. ఎక్కడైనా లీకేజీలు, ఇతర సమస్యలు ఉంటే పరిష్కారానికి, ప్లాంట్లు, ట్యాంకులు శుద్ధీకరించేందుకు సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ కలెక్టర్లకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

ఎన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు?

మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 14 నీటి శుద్ధి ప్లాంట్లు ఉన్నాయి. వాటి ద్వారా 2,639 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నాం.

నీటిని ఎలా శుద్ధి చేస్తారు?

శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకునే రా నీటిలో ఎలాంటి కలుషితాలు ఉండవు. దాదాపు స్వచ్ఛతతోనే ఉంటాయి. భూగర్భ జలాల్లో మాత్రం నీటి కాలుష్యం అధికంగా ఉంటుంది. ఆ నీటిని డబ్ల్యూహెచ్‌వో(వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) సూచనల మేరకు ఫ్లోరైడ్ తదితర పరీక్షలు నిర్వహించి, శుద్ధి చేస్తున్నాం.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏమైనా నిధులు ఇచ్చిందా?

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు ఒక్కో దానికి రూ.కోటి చొప్పున కలెక్టర్లకు విడుదల చేసింది. అయితే వేసవిలో నీటి ఎద్దడి లేనందున ఆ నిధులను ఇప్పుడు వాడుకోనున్నారు. వాటర్ ప్లాంట్ల శుద్ధీకరణ, మరమ్మతులు ఉంటే ఆ నిధులతో చేపట్టనున్నారు.

రోజూ ఒక మనిషికి ఎన్ని లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు?

గ్రామీణ ప్రాంతంలో ఒక మనిషికి రోజు 100 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాం. అదే అర్బన్‌లో అయితే 130 లీటర్లు, మునిసిపాలిటీలో 150 లీటర్ల చొప్పున సరఫరా చేస్తున్నాం.

సర్కిల్‌లో రోజూ ఎన్ని లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు?

మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో రోజూ 267 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్లు డైలీ)ల నీటిని సరఫరా చేస్తున్నాం. అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 113 ఎంఎల్‌డీలు, నారాయణపేటలో జిల్లాలో 57, నాగర్‌కర్నూల్ జిల్లాలో 95 ఎంఎల్‌డీల నీటిని అందిస్తున్నాం.

లీకేజీలను ఎలా పరిష్కరిస్తున్నారు?

పైప్‌లైన్ లీకేజీలను గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అధికారులు చేపడుతుండగా, గ్రిడ్‌లో మాత్రం ఏజెన్సీ వారు లీకేజీలు, ఇతర మరమ్మతులు వారి కాలపరిమితి పూర్తయ్యే వరకు నిర్వహిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎలా ఉంది?

ప్రతీ వాటర్ ప్లాంట్‌ను వారి పరిధిలోని డీఈలు, ఏఈలు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైన చిన్న సమస్య వచ్చినా ఇంట్రా, గ్రిడ్ అధికారులు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తున్నారు.

నేడు రైతు నేస్తం

- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఏ రైతు వేదికలోని రైతులతోనైనా సీఎం మాట్లాడే అవకాశం
- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- వేదికలను తోరణాలు, పూలతో ముస్తాబు చేయాలి
- వీసీలో అధికారులతో కలెక్టర్ విజయేందిర బోయి


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా రైతు వేదికలను ముస్తాబు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, అనుబంధ శాఖల అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్ష చేశారు. ఆధునిక పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికత తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రైతులకు తెలిపేందుకు సీఎం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. జిల్లాలో 86 రైతు వేదికలు ఉండగా, అందులో 48 రైతుల వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉందన్నారు. మరో 32 రైతు వేదికల్లో ఈ సోమవారం ప్రారంభం కానుందని చెప్పారు. సీఎం కార్యక్రమం ప్రత్యేక ప్రసారానికి రైతు వేదికల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి అందించే సూచనలు, సలహాలు రైతులు విని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా రైతు వేదికల పరిధిలో 250 రైతులు ఉండేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 4 గంటలకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడతారని చెప్పారు. ముఖ్యమంత్రి ఏ రైతు వేదికలో ఉన్న ఏ రైతులతోనైనా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతీ రైతు వేదికను పండుగ వాతావరణంలో మామిడి తోరణాలు, పూలతో అలంకరించాలని సూచించారు.

నేనేంట్రా ఇంత అందంగా ఉన్నాను..

క్లిక్.. క్లిక్..

మనుషులు అద్దంలో తమ ముఖాన్ని చూసుకుని మురిసిపోతుంటారు. అదే ఓ పక్షి చూసుకుంటే ఎలా ఫీలవుతుందో కదా! అదే ఇక్కడ జరిగింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత బజార్ పెట్రోల్ బంకు వద్ద శనివారం నిలిపి ఉన్న ఓ బైక్ సైడ్ అద్దంపై ఒక పిచ్చుక వచ్చి వాలింది. అద్దంలో తనను తాను చూసుకుంది. అక్కడ ఇంకో పక్షి ఉందనుకుందో.. అది తనే అనుకుందో తెలియదు కానీ.. అద్దంలో కొద్దిసేపు అలానే చూసింది. ఆ తర్వాత రెక్కలు విప్పి ఎగురుతూ ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. అనంతరం చుంబిస్తున్నట్లు అద్దంపై తన ముక్కుతో కొట్టింది. ఈ అరుదైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి


వీడెవడ్రా అచ్చం నాలా ఉన్నాడు



ఆ.. వీడు ఎవడో కాదు.. నేనే..



అబ్బ ఎంత ముద్దొచ్చేస్తున్నానో..



భవనం పైనుంచి దూకి..
వివాహిత ఆత్మహత్య

- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘటన
- భార్యాభర్తల మధ్య గొడవలు
- భర్త వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

7

అన్ని వర్గాల కోసం
ఎమ్మార్పీఎస్ పోరాటం

- వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి: ఐజీ బి. సుమతి
- కలుగొట్లలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

7

ధరాఘాతం

- పచ్చిరొట్ట విత్తనాలకు ధరల సెగ
- 30 కిలోల జీలుగ విత్తనాల ధర గత ఏడాది కంటే రూ. 1,021 అధికం
- జనుములు 40 కిలోల బస్తాపై రూ.1,062 పెంపు
- ఏటా తగ్గుతున్న రాయితీలు

7

అభ్యంతరాల పరిశీలనకు నేడు ఆఖరు

- పాలమూరు కార్పొరేషన్ డివిజన్‌ల విభజనపై రేపు కలెక్టర్‌కు నివేదిక..
- 21న ఫైనల్ నోటిఫికేషన్


మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్ డివిజన్‌ల విభజనపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన సోమవారంతో ముగియనుంది. విభజనపై అధికారులు ఈ నెల 11 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. 5 రోజుల పాటు నేటి సాయంత్రం వరకు వాటిని పరిశీలిస్తారు. అందులో మార్పులు చేయాల్సినవి ఉంటే మారుస్తారు. అన్ని డివిజన్‌ల నుంచి మొత్తం 94 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో కొన్ని చిన్న చిన్న అభ్యంతరాలు కాగా, కొన్ని మాత్రం ఏకంగా కాలనీల మార్చాలని వచ్చాయి. వాటిని మార్చాలంటే మొత్తం విభజనపైనే ప్రభావం పడనుంది. వాటిని మారుస్తారా? లేదంటే అలానే ఉంచుతూ మార్పు సాధ్యం కాదని నివేదిక సమర్పిస్తారా? అన్నది ఫైనల్ నోటిఫికేషన్‌లో వెలువడనుంది. సోమవారం సాయంత్రం వరకు అభ్యంతరాలన్నింటిని పరిశీలించి మంగళవారం కలెక్టర్‌కు నివేదిస్తారు. పరిశీలిన అనంతరం ఆ జాబితాను మళ్లీ ఎక్కడా ప్రచురించరు. ఎవరైతే అభ్యంతరాలు ఇచ్చారో ఆ వ్యక్తికి మాత్రం వారిచ్చిన అభ్యంతరాలను ఏం చేశారనే కారణాలను తెలియజేస్తారు. కలెక్టర్ నుంచి ఈనెల 19న సీడీఎంఏకు నివేదికను సమర్పిస్తే 20న ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు. ప్రభుత్వం ఈనెల 21న ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తుంది. అప్పుడే ఏ డివిజన్‌లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? డివిజన్‌ల లోకేషన్, ఇంటి నెంబర్లు, ప్రాంతాలు తెలియనున్నాయి.

కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


మాట్లాడుతున్న భూపాల్

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తున్నాయని, కార్మికులు ఐక్యంగా ఉద్యమించి వాటిని అడ్డుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణపేటలో రెండోరోజు జరిగిన జిల్లా స్థాయి ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు ట్రేడ్ కోడ్‌ల వల్ల ఉద్యోగ, కార్మిక వర్గంపై ప్రభావం చూపుతూ యజమానులకు అనుకూలంగా తయారు చేశారని ఆరోపించారు. వేతనాల కోత, పని భద్రత, ఆరోగ్య భద్రత, సామాజిక భద్రతల కోడ్‌లు కార్మికులను బానిసత్వంలోకి నెట్టే కోడ్‌లని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 12 ఏళ్లగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరించే విధానాన్ని మరిచి పోయిందన్నారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రా మిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్, ఆంజనేయులు, గోవింద్‌రాజు, జ్యోషి, సౌభాగ్యలక్ష్మి, చంద్రకళ, భారతి, రాధ, కృష్ణయ్య, భీంశప్ప, శ్రీనివాస్, భీమేష్, గౌరమ్మ, వెంకటేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

● హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నారాయణపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్ అన్నారు. టీయూసీఐ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా మొదటి మహాసభలను నిర్వహించారు. మహాసభల సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ మెయిన్ చౌరస్తా సరాఫ్ బజార్ మీదుగా ఎస్ఆర్ గార్డెన్ వరకు భారీ ఎత్తున కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఓ సమావేశంలో మాట్లాడుతూ నేను బీజేపీలో పాఠశాల, టీడీపీలో కళాశాల, కాంగ్రెస్‌లో ఉద్యోగం చేస్తున్నానని పేర్కొన్నారని గుర్తు చేశారు. అందుకేనేమో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు కూడా ప్రజా కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలే ఉన్నాయన్నారు. కార్మిక సంఘాల ఐక్యతను నిర్వీర్యం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను మార్చి కార్మిక సంఘాల అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మికుల హక్కుల కోసం, రక్షణ కోసం కనీస వేతనం రూ.26 వేలు అమలు కోసం, సకాలంలో వేతనాలు ఇవ్వడం కోసం, సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం కార్మికుల కర్తవ్యం కావాలని, అందుకే అన్నిరంగాల కార్మికులు ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. సభలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, అడ్వకేట్ కాలేశ్వర్, యాదగిరి, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, పెద్దింటి రామకృష్ణ, కృష్ణ, నారాయణ, ప్రశాంత్ తదితరులున్నారు.

శ్రామిక పక్షపాతి మహాకవి శ్రీశ్రీ

● శ్రీశ్రీ సాహిత్యంపై సదస్సు - కవి సమ్మేళనం విజయవంతం


సదస్సులో మాట్లాడుతున్న బాదేపల్లి వెంకటయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల, శ్రామికుల పక్షాన నిర్భయంగా నిలిచి, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన శ్రామిక పక్షపాతి మహాకవి శ్రీశ్రీ అని వక్తలు డాక్టర్ పరిమళ్, బాదేపల్లి వెంకటయ్య గౌడ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీ సాహిత్యం - ప్రాసంగికత, 75 సంవత్సరాల మహాప్రస్థానంపై సదస్సులో వక్తలు, పలువురు కవులు, రచయితలు ప్రసంగించారు. సామాజిక దృక్పథంతో సామాన్యుల పక్షాన నిలిచిన అరుదైన కవి శ్రీశ్రీ అని కొనియాడారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం ఎందరినో కవులుగా మార్చి నూతన ఒరవడికి నాంది పలికిందన్నారు. యువతను జాగృతం చేసేందుకు శ్రీశ్రీ తన కవిత్వంలో కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు.. పావన జీవన బృందవన నిర్మాతలు అంటూ అభ్యుదయం వైపు నడిచిన యువతకు మార్గదర్శి అయ్యారన్నారు. తెలంగాణ సాహితి సలహాదారుడు తుమ్మల భాస్కరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన పలువురు కవులు కవితా గానంతో అలరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్, విద్యావేత్త సురభి జగపతి రావు, తెలంగాణ సాహితి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనద్దీన్, కొప్పోలు యాదయ్య, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల రీజియన్ కమిటీ ఎన్నిక


ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల మహబూబ్‌నగర్ రీజియన్ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ రెహమాన్ సోఫీ, రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి సత్యన్న ఆచారి, రాష్ట్ర కార్యదర్శి బసన్న ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. రీజియన్ అధ్యక్షుడిగా భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శిగా సత్యశీలారెడ్డి, కోశాధికారిగా కే.కే.మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామ్మూర్తి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, చీఫ్ అడ్వయిజరుగా ఎంకే జోసెఫ్, జాయింట్ సెక్రటరీగా దమ్మాయపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని పలువురు ఘనంగా సన్మానించారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భాస్కరాచారి, సత్యశీలారెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని పది డిపోలకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి: యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు కిష్టయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు ప్రతీ సంవత్సరం వేసవి సెలవుల్లో పదోన్నతులు కల్పిస్తామన్న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కిష్టయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 700 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూల్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. డీఈవో పోస్టులు చాలా వరకు ఇన్‌చార్జిలే ఉన్నారని, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ 2023 నుంచి అమలు కావల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే వెలువరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు 101 పద్దుకింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, నర్సింహులు, కోశాధికారి భాస్కర్, నాయకులు మణ్యం, కిష్ట్యానాయక్, అజయ్, హేమంత్‌కుమార్, శివరాజు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


కార్యకర్తలతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

● ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయాన్ని స్థానిక నాయకులు మార్కెట్ చైర్మన్ హరలింగం, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత ఆదరణ కలిగిన మైసమ్మ తల్లి దయతోనే తాను పాదయాత్ర చేపట్టి ప్రజల మెప్పుతో ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. నాయకులు అంబదాసు, పుట్టి శ్రీనివాసులు, శంకర్‌నాయక్, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

వరద కాలువ మూసివేయడంపై.. హైకోర్టు తీర్పు హర్షణీయం

● ఇరిగేషన్ కాలువలు మూసే అధికారం ఎవరికీ లేదని ధర్మాసనం స్పష్టీకరణ

● ఇరిగేషన్ ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి


వరద కాలువలో వేసిన పైపులు

కోస్గి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వరద కాలువను మూసి రోడ్డుగా మార్చుకొని అధికారులు కాలువను మూయవద్దని చెబితే ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు మొదటి రోజు వాదనలు వింటూనే ఇరిగేషన్ కాలువ మూసే అధికారం ఎవరికీ లేదని కేసును కొట్టివేసిందని ఇరిగేషన్ ఏఈ పవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కోర్టు అందించిన ఆర్డర్ కాపీ ప్రతులను విలేకరులకు అందించి, మాట్లాడారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముశ్రీఫా గ్రామ శివారులోని మది గండ్లకుంట నుంచి వాగుకు వెళ్లే వరద కాలువను ఓ వ్యక్తి తన పొలానికి వెళ్లేందుకు రోడ్డు లేదని అలుగు కాలువలో పైపులు వేసి మూసివేశాడు. అలా చేయొద్దని, పైపులను తొలగించాలని పదేపదే చెబితే హైకోర్టును ఆశ్రయించి ఇరిగేషన్ అధికారులకు నోటీసులు పంపారన్నారు. తమ శాఖ న్యాయవాది ద్వారా తాము ఆ కాలువ ఎక్కడినుంచి ఎలా వస్తుంది, ఎక్కడికి పోతుందన్న పూర్తి ఆధారాలతో కోర్టుకు వివరించామన్నారు. మొదటి రోజు వాదనలతోనే వాయిదాలు లేకుండా ఇరిగేషన్ పాటుకాలువలు మూసే అధికారం ఎవరికీ లేదని, పైపులు మూసి యదావిధిగా కాలువను అలాగే ఉంచాలని కోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాలు హర్షణీయమని ఏఈ పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో కాలువను యదావిధిగా ఉంచుతామన్నారు. మండలంలో మరిన్ని పాటుకాలువలు మూసివేశారని వాటిని సైతం యదావిధిగా తీయిస్తామన్నారు.

క్రీడాకారుడిని సన్మానించిన ఎమ్మెల్యే


క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గద్వాలకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఖయ్యూం సౌత్‌ఆఫ్రికాలో జరిగే కౌంటింగ్ క్రికెట్‌కు ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి క్రీడాకారుడిని శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌత్‌ఆఫ్రికాలో మంచి క్రీడాప్రదర్శన చేసి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, గద్వాల ప్రాంతానికి, క్రీడారంగానికి మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, రిజ్వాన్, ఫయాజ్, క్రికెట్ కోచ్ శ్రీను, క్రీడాకారులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటగిరిలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ప్రతీ నెల శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని వెంకటగిరిలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ పూజారి మంత్రోర్చనలతో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ చోరీ

కోయిలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ చోరీకి గురైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయికొండ మండలం మోదీపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మైపాల్‌గౌడ్ శనివారం వ్యవసాయ పనులు ముగించుకొని గ్రామంలోని తమ కిరాణం డబ్బా వద్ద పెట్టగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ ఇంజన్‌ను ఎత్తుకెళ్లారు. కొన్ని రోజులుగా మండలంలో ట్రాక్టర్ బ్యాటరీలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్తున్నారని, కానీ టాక్టర్ ఇంజన్ ఎత్తుకెళ్లడం ఇదే మొదటిసారి అని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మైపాల్‌గౌడ్ తెలిపారు.


నీటిలోనే సంగమేశ్వరుడికి పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

సంగమేశ్వరుడిని చుట్టుముట్టిన వరద జలాలు

● జలాధివాసం అవుతున్న సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కొల్లాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్త నదుల సంగమ క్షేత్రం సంగమేశ్వరం ఆలయాన్ని కృష్ణా జలాలు చుట్టుముట్టాయి. ఆదివారం ఆలయ ఆవరణలో వరద నీరు చేరడంతో పూజారి తెలకపల్లి రఘురామయ్య శర్మ చివరి రోజు మంగళ హారతి, ప్రత్యేక పూజలు చేశారు. మరో వారం రోజుల్లోపు వరద జలాలతో సంగమేశ్వరం ఆలయం పూర్తిగా జలధివాసం కానుందని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో వరద జలాలు చేరడంతో భక్తులు బోట్ల ద్వారా బయటికి వచ్చారు. భక్తులకు సంగమేశ్వరుడి దర్శనం మరో వారం రోజులు మాత్రమే ఉండనుంది.


సప్తనదుల సంగమక్షేత్రం సంగమేశ్వరం ఆలయాన్ని చుట్టుముట్టిన కృష్ణానది వరద జలాలు

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు


అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న పెద్దకొత్తపల్లి ఎస్ఐ పీ సతీష్

పెద్దకొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రతీ ఆదివారం అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. మృగశిర కార్తె రావడంతో రైతులు కుటుంబ సభ్యులతో కలిసి మైసమ్మ తల్లి దేవతకు మొక్కులు తీర్చుకునేందుకు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నాకే ఆ మరుసటి రోజు నుంచి వ్యవసాయ పొలాల్లో విత్తనాలు విత్తడం సంప్రదాయంగా మొదలు పెడతారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాలతో భారీ ఎత్తున తరలి రావడంతో మైసమ్మ దేవతకు సమీపంలో కిలో మీటరు పొడవునా రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలు ఆగిపోవడంతో మైసమ్మ దేవత దర్శనం కోసం వచ్చిన భక్తులు పడరాని పాట్లు పడ్డారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి దాదాపు ఈ ఆదివారం 4వేల మందికి పైగా భక్తులు మైసమ్మను దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు తాము కోరుకున్న కోరికలు నెరవేరాలని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా రూ.1,02,700, హుండీ ద్వారా రూ.1,96,216, మొత్తం రూ. 2,98,916 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎల్లేని


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానించిన ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఎల్లేని సు ధాకర్‌రావు శాలువాతో సత్కరించారు. కిషన్‌రెడ్డి జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అనంతరం కొల్లాపూర్ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కొల్లాపూర్ నియోజక వర్గంలో పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేసినందుకు కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేసి కొల్లాపూర్ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మంత్రిని కోరారు.

సాయిచంద్ ఆశయాలను కొనసాగిస్తున్నాం

● రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని

● 29న సాయిచంద్ విగ్రహావిష్కరణ బహిరంగ సభ


మాట్లాడుతున్న రజిని

అమరచింత, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కళను, కళాకారులను ప్రోత్సహిస్తూ తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో ప్రజలను చైతన్య పరిచిన సాయిచంద్ ఆశయాలను భార్యగా తనతో పాటు ప్రతీ ఒక్కరు కొనసాగించాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 29న సాయిచంద్ వర్ధంతిని పురస్కరించుకుని అమరచింత బస్టాండ్ సెంటర్‌లో విగ్రహావిష్కరణతో పాటు హై స్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సభకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, పలువురు కళాకారులు విచ్చేయుచున్నట్లు ఆమె పేర్కొన్నారు. సాయిచంద్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. విగ్రహావిష్కరణ, బహిరంగసభ స్థలాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, నర్సింహ గౌడ్, నాగభూషణంగౌడ్, జయసింహ రెడ్డి, సుజంధర్‌బాబు, లెనిన్, షానవాజ్, సత్యనారాయణ, గోపాల్ నాయక్, శేఖర్, తెలుగు రమేష్ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- గిరిజనాభివృద్ధి పథకంపై అవగాహన కల్పించిన అధికారులు

గట్టు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని వాయిలకుంట తండాలో గిరిజనాభివృద్ధి (ధర్తిఅభజన భాగీదారి అభియాన్) పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం గిరిజన ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, గ్రామీణ రహదారుల అభివృద్ధిని సాధించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని గిరజనాభివృద్ధి శాఖ అధికారి వివరించారు. తండా వాసులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ అధికారి ఎం. పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



తిరుపతయ్య(ఫైల్)

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మార్నింగ్ వాక్‌కు వెళ్లి, వెంట తీసుకెళ్లిన కుక్కను ఓ పక్కన కట్టేసి, చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని మినీట్యాంక్‌బండ్ (నల్ల చెరువు) వద్ద చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటకు చెందిన న్యాయవాది, ట్యాక్స్ కన్సల్టెంట్ గుండు తిరుపతయ్య(55) ఆదివారం ఉదయం 6:30గంటలకు పెట్‌డాగ్‌తో సమీపంలోని మినీట్యాంక్‌బండ్‌కు వెళ్లాడు. పెట్‌డాగ్‌ను రేలింగ్‌కు కట్టేశాడు. అనంతరం మినీట్యాంక్‌బండ్‌లో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో తలకిందులుగా పడి మునిగిపోయాడు. ఇదే సందర్భంలో తిరుపతయ్యకు తలకు కుడివైపు రక్తగాయం అయ్యింది. మునిగిన సందర్భంలో కాలు నీటిపై తేలి ఉండడాన్ని కావేరమ్మపేటకు చెందిన సాయిలుగా గుర్తించిన పలువురు బయటికి లాగాడు. తలకు రక్తగాయంతో పాటు ఊపిరి ఆడక మృతి చెందాడని, తన భర్తపై ఎలాంటి అనుమానం లేదంటూ తిరుపతయ్య భార్య విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

చెరువులో పడి..

మరికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన మల్లేష్ (42) చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీరప్ప, మల్లమ్మ దంపతుల కూమారుడు మల్లేష్, ప్రతి రోజు చెరువులో ఉన్న తామర పూలు తీసుకెళ్లి శివపూజ చేసేవాడు. రోజు మాదిరిగా ఆదివారం ఉదయం పూజకు పూలకని వెళ్లి ప్రమాదవశాత్తుగా చెరువులో పడి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

చికిత్స పొందుతూ..

గండీడ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బెత్తరి లక్ష్మయ్య (54) గత నెల 28న సబ్జ పైన కట్టెలను పెట్టేందుకు మోసుకుంటూ పైకి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమత్తం గండీడ్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేయించి కోస్గి ఆసుపత్రికి తీసుకవెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చితక్సి కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈనెల 14వ తేదీ రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం మృతిని కొడుకు బెత్తరి బచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవనంపై నుంచి దూకి

వివాహిత ఆత్మహత్య

» భర్త వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపుల కారణంగా మూడు అంతస్థుల భవనంపై నుంచి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల పట్టణంలోని మాధవరావు కాంపౌండ్‌కు చెందిన అనూష(30)ను మహబూబ్‌నగర్ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆంజనేయులుతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరు జడ్చర్ల పట్టణంలోని ఆజం రైస్ మిల్లు వెళ్లే దారిలోని ఓ భవనంలో ఇల్లు కిరాయికి తీసుకుని ఉంటున్నారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనూష పనిచేస్తుండగా, డ్రైవర్‌గా ఆంజనేయులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. భర్త వేధింపుల కారణంగా ఉదయం 6గంటల ప్రాంతంలో మూడు అంతస్థుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఊరడి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

మద్దూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపి వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను దంగాన్‌పూర్ శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలిం చినట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నరేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వలస కార్మికుడి మృతి



మృతి చెందిన వలస కార్మికుడు రంజన్ సుహత్

బాలానగర్, జూన్ 15: మండలంలోని పెద్దాయపల్లి రెవెన్యూ శివారులో ఓ దాణా కంపెనీలో బిహార్‌కు చెందిన ఓ వలస కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై లెనిన్ కథనం మేరకు.. బిహార్ రాష్ట్రం చంపారన్ జిల్లాకు చెందిన రాజకుమార్, రంజన్ సుహత్‌లు ఇద్దరు సోదరులు. బతుకు దెరువు నిమిత్తం బిహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చి గత కొన్ని నెలలుగా మండలంలోని పెద్దాయపల్లి శివారులోని ఓ దాణ కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి 8గంటలకు కంపెనీలో డ్యూటీ చేసేందుకు వెళ్లాడు. మరుసటి రోజు 14న ఉదయం 8గంటలకు తన గదిలోకి వచ్చి నిద్రించాడు. సాయంత్రం వరకు నిద్ర లేకపోవడంతో సోదరుడు రాజ్‌కుమార్ పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్‌పై దుర్భాషలాడిన మహిళ

» అరగంట పాటు జడ్చర్ల రాణా వద్ద ఆర్టీసీ బస్సు నిలిపివేత

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా ప్రయాణికురాలి నోటి దురుసుతనం కారణంగా బస్సులో ప్రయాణిస్తున్న తోటివారు సుమారు అరగంట పాటు ఇబ్బందులకు గురైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరింది. సుమారు 12గంటల ప్రాంతంలో జడ్చర్ల కొత్తబస్టాండుకు చేరుకుని, మళ్లీ అక్కడి నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరింది. జడ్చర్ల కొత్తబస్టాండులో జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ అదే బస్సులో ఎక్కింది. బస్సు అంతా ఫుల్ ఉండటంతో ఆమె ఫుట్‌బోర్డు వద్ద నిలబడింది. బ్రేక్ వేసిన సందర్భంలో కిందపడే అవకాశం ఉందని, బస్సు లోపలికి రావాలంటూ సదరు మహిళకు బస్సు డ్రైవర్ సూచించారు. దీంతో కోపోద్రిక్తురాలైన ఆమె ఆర్టీసీ డ్రైవర్‌పై దుర్భాషలాడింది. దీంతో మహిళపై ఫిర్యాదు చేసేందుకు దారిలోనే ఉన్న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీస్‌స్టేషన్‌లో సైతం సదరు ప్రయాణికురాలు ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించింది. ఈ మహిళ కారణంగా సుమారు అరగంట పాటు బస్సు నిలిచిపోవడంతో తోటి ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను వదిలిపెట్టి, ఆ బస్సు కొల్లాపూర్‌కు బయలుదేరింది.

గృహ కార్మికులకు గుర్తింపేది?



ఇంట్లో పనిచేస్తున్న వెంకటమ్మ

» దుర్భర స్థితిలో ఇంటి పనివారు » అమలు కాని జీవో నెంబరు 60
» మహబూబ్‌నగర్, వనపర్తి పట్టణాల్లో అధికం
» నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

20ఏళ్ల నుంచి ఇదే పనిచేసుకుంటున్న

20ఏళ్ల నుంచి ఇళ్లలో పని చేసుకుంటున్న. యజమానులను గట్టిగా అడగలేం. వారు ఇచ్చినంత, మేము తీసుకున్నంత అన్నట్టుగా ఉంది మా వేతనం. రోజుకు ఒక గంటపాటు పనిచేసుకుని వెళ్లిపోతా. - మౌనమ్మ, గృహ కార్మికురాలు



పాలమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గృహ కార్మికుల ఇళ్లల్లో పని చేసే-డొమెస్టిక్ వర్కర్స్ జీవితం దుర్భరం. సమాజంలో గుర్తింపులేని వారిలో గృహ కార్మికులే అధికం. దంపతులిద్దరూ ఆఫీసులో ఉద్యోగం చేసి అలిసిపోయి ఇంటికి వస్తారు. అలాంటి వారు డొమెస్టిక్ వర్కర్స్‌ను పెట్టుకోవటం మామూలే. ఇళ్లలో వంట, బట్టలు ఉతకటం, బాసండ్లు తోమటం, ఇల్లు ఊడ్చటం, కల్లాపి చల్లటం, చిన్న పిల్లలను ఆడించటం, వృద్ధులకు సేవ చేయటం లాంటి పనుల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ రంగంలో అత్యధికులు వెనుకబడిన ప్రాంతాలకు చెందిన దళిత, బలహీన, గిరిజన వర్గాలకు చెందిన మహిళలే. అతి తక్కువ వేతనాలు తీసుకుని పనిచేయటం, అవమానాలు, నిందలు పాలవుతారు. లైంగిక వేధింపులు, భద్రత లేని జీవితాలు గృహ కార్మికులవి. ఒక ఇంట్లో రోజుకు గంటనుంచి ఐదు గంటల చొప్పున పని చేస్తుంటారు. విశ్రాంతి, సెలవు దినాలు, ఇతర సౌకర్యాలు, హక్కులు పొందలేని స్థితిలో ఉన్నారు. డొమెస్టిక్ వర్కర్స్ ఫోరమ్ ఇండియా(డీడబ్ల్యుఎఫ్‌ఐ), సీఐటీయూ, టీయూసీఐ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాయి. లబ్ధి పొందలేని కొందరు సంఘంగా ఏర్పడి సాధించగలమనే మనోధైర్యాన్ని వారిలో నింపేందుకు కార్మిక సంఘాలు కృషి చేస్తున్నాయి.

● బాలలతో పనిచేయించ రాదు



ఇళ్లల్లో బాలకార్మికులతో పనిచేయించటం చట్టరీత్యా నేరం. చిన్నారులు ఇళ్లలో పని చేసే విషయం తెలిస్తే లేబర్ అధికారులకు సమాచారం ఇవ్వండి. మేము పిల్లలను తీసుకువెళ్లి చదువుకునే ఏర్పాటు చేస్తాం. తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 1, 2016నుంచి గృహకార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆదేశించింది.

- చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎల్, మహబూబ్‌నగర్

● అమలు కాని జీవో

ఇళ్లల్లో పాచీపని చేయటం, కిరాణ వస్తువులు తేవటం, పిల్లలను బడికి తీసుకుపోవటం, తీసుకురావటం లాంటి పనులు చేసేవారికోసం వచ్చినదే జీవో నెంబరు 60. లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ డిపార్ట్‌మెంట్ జీవో 60ని (ఎల్‌ఏబీ 2) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబరు 1, 2011న విడుదల చేసింది. ఆడ, మగ ఎవరితో ఈ పనులు చేయించుకున్నా నెలరోజులు పాటు రోజూ అరంగంట చేస్తే రూ.206, గంటచేస్తే రూ.2747, గంటన్నర చేస్తే రూ.3,608, ఎనిమిది గంటలు చేస్తే రూ.6,700లు తగ్గకుండా ఇవ్వాలని జీవో చెబుతోంది. పనిచేసే వారికి భోజనం, దుస్తులు, రానుపోను చార్జీలు ఇవ్వటం, అది వేతనం కిందకు రాదు. జీవో చెప్పిన దానికంటే ఎక్కువ వేతనం ఇవ్వవచ్చు, కానీ తక్కువ మాత్రం ఇవ్వరాదు. జీవో ప్రకారం తక్కువ వేతనం ఇస్తే యజమానికి రూ.10వేల నుంచి రూ.2వేల వరకు జరిమానా, ఏడాది నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష.... ఒక్కోసారి రెండు అమలు చేసే వీలుంది.

● లైంగిక వేధింపులు అధికం



ఇళ్లలో పనిచేసే గృహ కార్మికులకు యజమానుల నుంచి లైంగిక వేధింపులు అధికం. వీరికి రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలి. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇచ్చి పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలి.

- కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

● సంఘంతోనే న్యాయం, రక్షణ



సుమారు 30 ఏళ్లనుంచి షాషాబ్‌గుట్ట, ఇతర ప్రాంతాల్లో ఇళ్లల్లో పనిచేస్తుకుంటున్న. నెలకు రూ.50 నుంచి నేడు రూ. 1000 తీసుకుంటున్న. ఒంటరిగా ఉండకుండా కుటుంబానికి ఏదో విధంగా సహాయ పడాలని ఇళ్లల్లో పనిచేస్తున్న.

- వెంకటమ్మ, గృహకార్మికురాలు

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ (మూడు వేలు), వనపర్తి(రెండువేలు)పట్టణాల్లో గృహ కార్మికులు అధికంగా పనిచేస్తున్నట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరికి డీడబ్ల్యుఎఫ్‌ఐ అవగాహన కల్పిస్తోంది. పన్నెండేళ్ల నుంచి సర్వేచేసి కార్మికులను గుర్తించే పనిలో ఆ సంఘం ఉంది. గ్రూపులు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహిస్తోంది. ఒక్కరు కాకుండా సంఘంగా యజమాని వద్దకు వెళ్లి తాము చేస్తున్న పనికి వేతనం పెంచుకోవటానికి కృషి చేస్తున్నారు. గతంలో నెలకు రూ.300 ఇస్తుంటే, సంఘం నీడలో నేడు ఐక్యంగా అడిగి రూ.500 నుంచి రూ.2500 వరకు వేతనాన్ని పొందుతున్నారు. కార్మికశాఖ గుర్తింపు కార్డులు అందజేస్తే ఎక్కడ ఎంతమంది కార్మికులు పని చేస్తున్నారనే వివరాలు తెలుస్తాయి.

ధరాఘాతం

» పచ్చిరొట్ట విత్తనాలకు ధరల సెగ » ఒక్క ఏడాదిలోనే భారీగా పెంపు
» ఏటేటా తగ్గుతున్న రాయితీలు » అన్నదాతలకు తప్పని ఆర్థిక భారం



జీలుగ విత్తనాలు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే తమ ధ్యేయ్యం అని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలపై ఈ ఖరీఫ్ సీజన్‌లో రేట్లు విపరీతంగా పెంచింది. విత్తనాల ధరలు పెంచి రాయితీని తగ్గించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో 30 కిలోల జీలుగ విత్తనాల ధర రూ. 1,021.50 పైసలు, జనుములు 40 కిలోల ధర రూ. 1,062, పిల్లి పెసర 20 కిలోలకు 974 రూపాయలు పెంచింది. ఈ ఐదేళ్ల కాలంలో 30 కిలోల జీలుగ ధర రూ.1576, జనుములు 40 కిలోలు రూ. 1580.80 పైసలు, పిల్లి పెసర 20 కిలోలు రూ.1479 ప్రకారం పెరిగాయి. గత ఏడాది 2024 ఖరీఫ్‌లో జీలుగ 30 కేజీల బస్తా రూ. 1,116 ఉండగా ఈసారి రూ. 2,137.50 పైసలు పెరిగింది. జనుములు 40 కిలోల బస్తా గత ఏడాది రూ. 1448 ఉండగా ఈసారి రూ.2510కి పెరిగింది. పిల్లి పెసర 20 కేజీలు గత ఏడాది రూ. 1,084 కాగా, ఈ ఏడాది 2,058కి పెరిగింది. కేవలం ఏడాదిలో అధికంగా ధరలు పెరగడంతో పాటు సబ్సిడీ గత ఏడాది 60 శాతం అందిస్తే ఈ ఏడాది కాస్తా సబ్సిడీ 50 శాతానికి ఇస్తున్నారు. సబ్సిడీ సైతం పది శాతం తగ్గింది. ఆర్థిక భారం అవుతుందని రైతాంగం ఆందోళన చెందుతుంది.

పచ్చిరొట్ట ఎరువుల సాగు

జిల్లాలో ఏటేటా రైతులు భూమికి సారవంతమైన పచ్చిరొట్ట విత్తనాలు విత్తుతూ కరిగెటలో కలియదున్నుతూ భూమి సారవంతం అయ్యేలా దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో జీలుగ విత్తనాలు రైతులు సాగు చేసేందుకు పొందిన విత్తనాల విషయానికి వస్తే 2019లో 689 క్వింటాళ్లు, 2020లో 969 క్వింటాళ్లు, 2021లో 1255 క్వింటాళ్లు, 2022లో 1480 క్వింటాళ్లు, 2023లో 1695 క్వింటాళ్లు, 2024లో 1770 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పొందిన రైతులు సాగు చేస్తూ వచ్చారు. ఇలా ఏటేటా పచ్చిరొట్ట విత్తనాలు పొంది రైతులు సాగు చేసేందుకు ఆసక్తి కనబర్చున్నారు.

జీలుగ విత్తనాలు 30 కేజీలు రెండున్నర ఎకరాల్లో సాగు చేసి 45 రోజుల అనంతరం ఏపుగా పెరిగిన పంటను కరిగేటలో కలియదున్నడం వల్ల భూమిలో చౌడు శాతం తగ్గి డీఏపీ వినియోగం తగ్గించుకొని సారవంతంతో పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెప్పుకొస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ వానాకాలం సాగు కోసం జీలుగ విత్తనాలు 2000 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 400 క్వింటాళ్ల రైతుల కు అందుబాటులో వ్యవసాయ శాఖ ఆగ్రోస్ కేంద్రాల్లో ఉంచడంతో రైతులు కొనుగోలు చేసి సాగుపై దృష్టి సారించారు.

అంతర్జాతీయ స్థాయిలో పేరు తేవాలి

● రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బీఎస్ ఆనంద్
● సౌత్‌ఆఫ్రికా టీసీఏ టీ-20 సీరీస్‌కు జిల్లా వాసి



ఎండీ ఖయ్యూం

గద్వాల అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌ఆఫ్రికాలోని టాంజానియా క్రికెట్ అసోసియేషన్ తరఫున టీ-20 సిరీస్‌కు ఎంపికైన జిల్లావాసి ఎండీ ఖయ్యూం అక్కడ రాణించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తేవాలని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బీఎస్ ఆనంద్ అన్నారు. ఆదివారం గద్వాల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు, గద్వాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రకుమార్‌లు క్రీడాకారుడిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్‌ఆఫ్రికాలో రెండు నెలల పాటు జరిగే కార్వాన్స్-టీ20 క్రికెట్ సీరీస్‌కు గద్వాలకు చెందిన ఎండీ ఖయ్యూం టాంజానియా క్రికెట్ అసోసియేషన్ తరఫున ఎంపిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. గతంలో ఖయ్యూం గద్వాల తరఫున జాతీయ స్థాయి పోటీల్లో ఆడిన ఘనత దక్కిందన్నారు. సౌత్‌ఆఫ్రికాలో రెండు నెలల పాటు జరిగే టీ-20 సీరీస్‌లో మంచి ఆటతీరును కనబరిచి జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ వెంకటేష్, ప్రభు త్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హరిబాబు, హుసేన్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

విద్వేషాలు, ఉద్రిక్తతలే మోదీ ఆయుధాలు

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

పాన్‌గల్/వనపర్తి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్వేషాలు ఉద్రిక్తతలే ప్రధాని నరేంద్ర మోదీ ఆయుధాలని, బీజేపీ పాలనలో దేశ ప్రతిష్ట దిగజారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కల్తీ విత్తనాలను అరికట్టాలని, రైతులకు ఎరువులను సబ్సిడీపై అందించాలని కోరారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెప్పినా వినకుండా కొనసాగిస్తున్న కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా పార్టీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని, అందుకు పార్టీ కార్యకర్తలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, వెంకటయ్య, మహబూబ్ పాషా, ఆది, నాయకులు వేణుగోపాల్, దేవేందర్, వెంకటేశ్, రాజేందర్ గౌడ్, రాము, భగత్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం తీవ్రంగా పెరిగిపోతోంది

సమాజం సంక్షోభాల భారిని పడి పేదరికం తీవ్రంగా పెరిగిపోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట మండలాల పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో పెట్టుబడిదారి సమాజం సంక్షోభంలో 2008 నుంచి కొనసాగుతుందన్నారు. అనంతరం భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర-సీపీఎం విశిష్టత అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు తరగతిని బోధించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, లక్ష్మి, కురుమయ్య, గంధం మదన్, గట్టయ్య, బీసన్న, బాలస్వామి, ఉమా, నందిమల్ల రాములు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి
» ఘనంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సన్మాన సభ



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్యను, ఆయన తల్లిని సన్మానిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని చేసి చూపిస్తున్న ప్రభుత్వం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కల్యాణ మండపంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నందిమల్ల యాదయ్య సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పదవి చేపట్టిన తరువాత మొదటిసారి పట్టణానికి వచ్చిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి ఘనంగా స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ...దేశంలోనే మొదటిసారి కులగణన పూర్తి చేసి ముస్లింలతో కలుపుకుని బీసీలు 52 శాతం ఉన్నారని ప్రకటించిన ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దమని పిలుపునిచ్చారు. అందరి అభిప్రాయాల మేరకే పార్టీ కోసం కష్టపడ్డవారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు ఉదాహరణే నందిమల్ల యాదయ్యకు దక్కిన గౌరవమన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, ఏఐసీసీ హెల్త్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, ధనలక్ష్మి, కదిరె రాములు, శంకర్‌రావు, చీర్ల జనార్ధన్, కిరణ్‌కుమార్, కోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం

» వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అలంపూరుచౌరస్తా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో అన్ని వర్గాల కోసం పోరాటం చేసిందని, ఎన్నో వర్గాలకు, పేదవారికి ఎన్నో పథకాలు వచ్చేలా కృషి చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం అయన ఎమ్మెల్యే విజయుడు, తెలంగాణ డీఐజీ బి.సుమతితో కలిసి ఉండవల్లి మండలం, కలుగొట్లలో మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన అలంపూరు చౌరస్తా నుంచి ర్యాలీతో కలుగొట్లకు చేరుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. 1845-50 మధ్యలోనే మహిళల కోసం పాఠశాల స్థాపించినన మహనీయుడు పూలే అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వర్గీకరణ కోసం పోరాడిందని, ఈ పోరాటంలో పలు ప్రభుత్వాలు పలు దఫాలలో ప్రవేశపెట్టిన బిల్లులన్నీ ఏకగ్రీవంగా ఆమోదించపడ్డాయని గుర్తు చేశారు. అంతకు ముందు ఐజీ సుమతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కొంత వరకే చదివించి అనాదిగా వస్తున్న వ్యవసాయం, కులవృత్తుల పనులకు పంపిస్తుంటారని, అలా కాకుండా అందరూ పూర్తిగా చదవాలని కోరారు. నా సొంత గ్రామంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కులం, మతం లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పూలే ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు.

అప్పుడే పుట్టిన ఆవు దూడ కుక్కల పాలు

- అయిజలో విషాదకర సంఘటన



అయిజ బస్టాండులో దూడకు జన్మనిచ్చిన ఆవు

అయిజ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అయిజలో హృదయ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అపుడే జన్మించిన ఆవు దూడ కుక్కల పాలయ్యింది. అయిజ పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో రోడ్డు ప్రక్కన శనివారం రాత్రి వీధి ఆవు దూడకు జన్మనిచ్చింది. అప్పటికే కాచుకు కూర్చున్న కుక్కలు చిన్న ఆవుదూడను పీక్కు తిన్నాయి. లేవలేని స్థితిలో ఆవు, నడవలేని స్థితిలో దూడ ఉండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ఈ సంఘటనను చూసిన జనం అయ్యో పాపం అనుకున్నారు. సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారే తప్ప సహాయం చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి

● కొత్తపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి రమేశ్



కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కొత్తపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి రమేశ్ కోరారు. రైతుల సంక్షేమం కోసమే తాము పనిచేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు పాటించాలని, తమ సూచనలు తీసుకోవాలని ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

రైతు వేదికల్లో విత్తనాల కొనుగోలుపై ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

సాగుకు సరిపడా వర్షం కురిసిందా?

ఇంతవరకు పడిన వర్షంతో నేలలో తేమ శాతం బాగానే ఉంది. రైతులు విత్తనాలు సాగు చేసుకునేందుకు సరిపడా వర్షాలు పడ్డాయి.

నకిలీ విత్తనాలు ఏ పంట రకానికి చెందినవి ఎక్కువగా ఉంటాయి?

పత్తి పంటకు చెందిన విత్తనాలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది.

మండలంలో పంటల సాగు ఎలా ఉంది?

మండలంలో దాదాపు మూడు నుంచి మూడున్నర ఎకరాల వరకు రైతులు జొన్న, పత్తి, కంది పంటలు సాగు చేశారు. ఇంకా కొంతమంది రైతులు అసలు సాగుకు కదలలేదు.

న్యూస్ బాక్స్

నేడు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో సీఎం ముఖాముఖి

● దామరగిద్ద రైతు నేస్తం కేంద్రంలో ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కేంద్రాల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నారాయణపేట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు నేస్తం కేంద్రాలకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. దామరగిద్ద రైతునేస్తం కేంద్రంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరవుతారన్నారు. అదేవిధంగా, మండలాల్లోని రైతువేదికల్లో నిర్వహించే ముఖ్యమంత్రి ముఖాముఖిలో పాల్గొనాలని ఆయా మండలాల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు రైతులను కోరారు.

నేడు ఊట్కూర్‌లో రెవెన్యూ సదస్సు

ఊట్కూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ చింత రవి తెలిపారు. భూసమస్యలు ఉన్న రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం సదస్సులో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. పాస్‌బుక్, ఇతర సమస్యలు ఏవైనా ఉంటే ఫిర్యాదు చేయాలని, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులందరు రెవెన్యూ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు గుండె వైద్య శిబిరం

మరికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్శన్ హాస్పిటల్‌లో సోమవారం గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఆసుపత్రి డాక్టర్ రాకేష్ ఆదివారం తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తామని, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఉదయం 10 గంటలకు నిర్వహించే వైద్య శిబిరానికి హాజరు కావాలని కోరారు. అలాగే, మండల ప్రజలకు బీపీ, ఆర్‌బీఎస్, ఎస్‌పీవో2, ఈసీజీ, 2డీఏకో కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని డాక్టర్ రాకేష్ వివరించారు.

రేపు ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు

మరికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీలేరు గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం జల్దిబిందె నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలి

నారాయణపేట న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు రఘురామయ్యగౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ సమక్షంలో పార్టీ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా వడ్డెదత్తు, నక్క సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పరిగి శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి విశాలక్ష్మి, హన్మంతురావు, చలపతి, కార్యదర్శులుగా బాబు, జయశ్రీ, విజయలక్ష్మి, మొగులప్ప, రాఘవేంద్ర, కోశాధికారిగా కల్పనతో పాటు, 12 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొత్తపల్లి రోడ్డుకు మోక్షం ఎన్నడు?

» చినుకు పడితే చిత్తడిగా మారుతున్న రహదారి

ఊట్కూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం నుంచి మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై కొత్తపల్లి గ్రామస్థులు మండల కేంద్రానికి రావాలంటే గుంతలమయంగా, మట్టి రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది. వర్షాలు పడితే నడవడమే నరకంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు చెప్తున్నారు. ఇక పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. గ్రామం నుంచి బిజ్వార్, పాతపల్లి గ్రామాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఎక్కడ ఏ గుంతలో, బురదలో జారి పడిపోతామోనన్న భయం. అలాగే వల్లపల్లి, ఎడవెల్లి గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాలంటే మట్టి రోడ్డే మార్గం. గ్రామ రహదారిపై బీటీ వేయాలని గ్రామస్థులు పలుమార్లు గత ఎమ్మెల్యేతో పాటు, ప్రస్తుత ఎమ్మెల్యేకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. గతంలో వర్షాలకు రోడ్డు తెగిపోయిన చోట కల్వర్టులను మాత్రం నిర్మించారు తప్ప రోడ్డు వేయలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మట్టి రోడ్లపై ప్రయాణాలు కొనసాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ వేసి గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.



బురదమయంగా మారిన బిజ్వార్ - కొత్తపల్లి రోడ్డు



బిజ్వార్ - కొత్తపల్లి రోడ్డులో గుంతలు, బురద

కేంద్రం పథకాలను ప్రతీ ఇంటికి చేరవేయాలి

» బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్



వడ్వాటు గ్రామంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్

మాగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతీ ఇంటికి చేరవేయాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ళ రవి కుమార్ అన్నారు. ఆదివారం మాగనూరు మండలంలోని వడ్వాటు గ్రామంలో పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా 11 సంవత్సరాల పాలన పట్ల మండలంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, కనకరాజు, వాకిటి మల్లేష్, మాజీ మండల అధ్యక్షులు నారాయణ, శ్రీనివాసులు, హనసేనప్ప, దండు రాఘవేంద్ర, మాజీ సర్పంచు తిమ్మప్ప, నాయకులు కిష్టప్ప, నరసింహులు, గుంటగారి అశోక్, బూత్ కమిటీ అధ్యక్షులు తిమ్మప్ప, లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు



ప్రమాదకరంగా ఉన్న పెద్దకడుమూరు నుంచి యాంకి గ్రామానికి వెళ్లే మూలమలుపు

నర్వ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మూలమలుపులను గుర్తించే విధంగా సూచికలు లేకపోవడంతో ఎక్కడ మూలమలుపులు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులతో పాటు కల్వాల్ నుంచి నర్వ మండల కేంద్రానికి వెళ్లే దారి, పెద్దకడుమూర్ నుంచి యాంకి గ్రామానికి వచ్చే దారిలో మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూలమలుపుల వద్ద సూచికలు లేకపోవడంతో పాటు రోడ్ల వెంట చెట్లు భారీగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నీట్ ర్యాంకర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

నారాయణపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షల్లో ర్యాంకు సాధించిన ఇద్దరు విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. నారాయణపేట పట్టణానికి చెందిన రంగ్రేజ్ కూతురు సకిన ఫాతిమా నీట్ పరీక్షల్లో 574 మార్కులతో ఆల్ ఇండియా 4533 ర్యాంకు సాధించింది. అలాగే, తాజుద్దీన్ కుమారుడు హాజీ మియాచాంద్ 418 మార్కులతో ఒక లక్షా 75 వేల ర్యాంకు సాధించాడు. ఇద్దరు విద్యార్థులకు ఎస్ఆర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించి, అభినందించారు.

రాష్ట్ర అంగన్‌వాడీ కార్మిక సంఘంలో

పేట జిల్లా వాసులకు చోటు



ఉషారాణి



అనిత

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అను బంధ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆదివారం భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగాయి. ఈ సందర్భంగా ఎన్నుకున్న రాష్ట్ర నూతన కమిటీలో నారాయణపేట జిల్లాకు చెందిన ఉషారాణి(నారాయణపేట), సహాయ కార్యదర్శిగా అనిత (మరికల్)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమం చేపడతామన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విలాసవంతమైన వస్తువులు, ప్లాట్లు ఇస్తామని విదేశీ యాత్రలకు పంపిస్తామని రకరకాల మాయమాటలతో మోసగించే సైబర్ నేరగాళ్లు రోజురోజుకు పెరిగిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, సందేశాలకు ఆకర్షితులు కాకూడదని సూచించారు. మోసపోతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి రావాలి



మంత్రికి ఆహ్వానం అందిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న నారాయణపేటలో జరిగే పదో తరగతి విద్యార్థులతో పాటు, ఫలితాల సాధనకు కృషి చేసిన హెచ్‌ఎంలకు అందించే ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి రావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వై.జనార్దన్ రెడ్డి మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి వస్తానని మంత్రి పేర్కొన్నారు.

కొనసాగుతున్న దిగంబర యజ్ఞం

మక్తల్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం పంచదేవ్‌పహాడ్ సమీపంలోని శ్రీపాదఛాయా ఆశ్రమంలో ఆదివారం దిగంబర యజ్ఞం కొనసాగింది. ఆశ్రమ పీఠాధిపతి చింత శ్రీపతిస్వామి దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహించి, యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నారాయణపేటరూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రామకృష్ణ తల్లి ఇటీవల మరణించగా ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. రామకృష్ణ తల్లి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ రాంమోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పేట వైదిక్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వైదిక ఉన్నత పాఠశాలలో 1990-91 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక లక్ష్మీబంక్వెట్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. 34 ఏళ్ల క్రితం తాము చదువుకున్న రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అంతకుముందు స్వర్గస్థులైన కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. కలిసికట్టుగా ఉండి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిద్దామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగ్గప్ప, బాల్‌రెడ్డి, ఉమాశంకర్, బి.వెంకట్‌రాములు, దేవేందర్, నర్సింగ్‌రావు, గంగాధర్, సరోజనమ్మ, సుజాత, పూర్వ విద్యార్థులు విజయ్ సాగర్, రఘురామయ్యగౌడ్, ప్రభాకర్, నాగార్జునారెడ్డి, ఉదయభాస్కర్, లక్ష్మీకాంత్, సతీష్‌గౌడ్, కే.శ్రీనివాస్ బండిరాజేశ్వరి, ముక్తాదేవి, జయలక్ష్మి, తేజస్విని తదితరులున్నారు.

మద్దూర్‌లో...

మద్దూర్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 2009-10 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మద్దూర్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన సమ్మేళనానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే చోట హాజరై నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అలాగే తమ యోగక్షేమాలు, స్థితిగతులను ఒకరిని మరొకరు అడిగి తెలుసుకున్నారు. అలాగే తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు వేణు గోపాల్, బాలాజీ, భానుప్రకాశ్, లాజర్, లింగప్ప, దానప్పలను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో 60మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దూర్‌లో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, విశ్వజిత్‌రెడ్డి దంపతులు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై వేంకటేశ్వరస్వామిని ఆదివారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, భర్త డాక్టర్ విశ్వజిత్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు అన్నివిధాలుగా సుఖసంతోషాలతో ఉండాలని, మంచిగా వర్షాలు కురిసి రైతుల పంటలు బాగా పండాలని భగవంతుడిని ప్రార్థించామని వారు తెలిపారు. విద్యార్థులు విద్యారంగంలో రాణించాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, వృద్ధులు ఆరోగ్యంగా ఉండాలని, మహిళలకు ఆత్మస్థైర్యం కలగాలని, ప్రతీ కుటుంబం ఆర్థికంగా బలపడాలని, సమాజంలో సోదరభావం చిగురించాలని, రాష్ట్ర అభివృద్ధిపథంలో ముందుకెళ్లేందుకు శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు.

జిల్లా ఆసుపత్రి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం



పేట మండలం అప్పక్‌పల్లి దగ్గర జిల్లా ఆసుపత్రి ముందు నిలిచిన పల్లెవెలుగు బస్సు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేట మండలంలోని అప్పక్‌పల్లి దగ్గర కొనసాగుతున్న జిల్లా జనరల్ ఆసుపత్రికి ఆదివారం నుంచి రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే బస్సులు దారిలో అప్పక్‌పల్లి దగ్గర వయా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి రానుపోను మహబూబ్‌నగర్ మెయిన్ రోడ్డుకు కిలోమీటర్ దూరం అవుతుంది. ఇక్కడి వరకు ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించడంతో రోగులకు సంస్థ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈనెల 1 నుంచి అప్పక్‌పల్లి దగ్గర ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి కొనసాగుతున్న దృష్ట్యా ఆర్టీసీ రవాణా సేవలు అందక రోగులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రి వరకు బస్సు సౌకర్యం కల్పించి రవాణా ఇబ్బందులు తీర్చాలనే డిమాండ్ అధికం కావడంతో పాలకులు, అధికారులు స్పందించి ఎట్టకేలకు ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఆదివారం నుంచి పల్లెవెలుగు బస్సులు అప్పక్‌పల్లి దగ్గర వయా జిల్లా ఆసుపత్రికి వచ్చివెళ్లేలా చేయడంతో ఆర్టీసీ సేవలు రోగులు, ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి.

పార్టీ పటిష్టతకు కమిటీ సభ్యులు పాటుపడాలి

» పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంపురం సదాశివారెడ్డి

నారాయణపేట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు గ్రామ కమిటీ, యువజన కమిటీల సభ్యులు పాటుపడాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంపురం సదాశివారెడ్డి అన్నారు. ఆదివారం పేట మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో గ్రామ కమిటీ, గ్రామ యువజన కమిటీలను సదాశివారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేలా కృషి చేయాలన్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కె.మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా వాకిటి శివలింగప్ప, ఉపాధ్యక్షులుగా కుర్వగంగప్ప, తిక్క శివప్ప, రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అంజేష్, సురేష్‌గౌడ్, అంజప్ప, కోశాధికారిగా చింతల్‌రెడ్డి, గ్రామ యువజన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.మోహన్‌రెడ్డి, రాంపురం మధుసూదన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మప్ప, బోయ సురేష్, శివానంద్, ప్రధాన కార్యదర్శిగా బోయ తిమ్మప్ప, వాకిటి అనిల్, చంద్రప్ప, చిన్ననర్సమ్మలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18 నెలల్లో చేసిన అభివృద్ధి ఎక్కడ?

» మంజూరైన నిధులు, అభివృద్ధి పనులు వెనక్కివెళ్లడంపై ఎమ్మెల్యే సమాధానమివ్వాలి

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో జీవో కాపీ చూపిస్తూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన 18 నెలల కాలంలో నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు బరి తెగించి మాట్లాడుతున్నారని, మెడికల్ కళాశాల మాకు సంబంధం లేదు.. అది గత ప్రభుత్వం చేసిందంటారు. అంటే మెడికల్ కళాశాలను తెచ్చింది ఎస్.రాజేందర్‌రెడ్డి అని చెప్పకనే చెబుతున్నారన్నారు. మరికల్‌లో బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే ఆ నిధులు ఎక్కడికి పోయాయని దీనికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధన్వాడ మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేస్తే ఎమ్మెల్యే సొంత గ్రామంలో కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసుకోలేకపోవడం అసమర్థతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు నియోజకవర్గ అభివృద్ధిపై ధ్యాస లేదు కానీ ఇసుక, నల్లమట్టి, మొర్రం దందాలపైనే ధ్యాస ఉందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా కేంద్రానికి మంజూరైన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను పాలెంకు తరలించారని, తరలించిన కళాశాలను పేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అంజలి, మాజీ ఎంపీపీ నర్సప్ప, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

యాదవ మండల కమిటీ ఎన్నిక



కొత్తపల్లి మండల అధ్యక్షుడికి కమిటీ నియామక పత్రం అందిస్తున్న యాదవులు

కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యాదవ మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఆల్ ఇండియా యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుర్రం హన్మంతుయాదవ్ హాజరయ్యారు. కమిటీ మండల అధ్యక్షుడిగా బాయిని ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతుయాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్నిరంగాల్లో ముందుండి పోరాడాలన్నారు రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో యాదవులు, కురుమల ఓట్లను వాడుకొని ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో యాదవులు, బీసీలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు.

జింకల బెడద నుంచి పంటలను కాపాడాలి

ఊట్కూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్రస్‌పల్లి, పగిడిమారి, ఓబ్లపూర్ గ్రామాల్లోని పంట పొలాల్లో మొక్కలను నాశనం చేస్తున్న జింకల బెడద నుంచి పంట పొలాలను కాపాడాలని భారతీయ కిసాన్ సంఘం జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కోశాధికారి పటేల్ రంగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, పగిడిమారి గ్రామ అధ్యక్షుడు మన్నే నాగార్జునలు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు ముందుగా రావడంతో రైతులు విత్తనాలు నాటగా మొలకలు కూడా వచ్చాయని తెలిపారు. కానీ పగిడిమారి, తిప్రస్‌పల్లి, ఓబ్లపూర్ గ్రామాల్లోని పంట పొలాల్లోకి జింకల గుంపు వచ్చి మొక్కలను ధ్వంసం చేస్తుండడంతో మొలక దశలోనే నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఫారెస్టు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి పంట పొలాలను కాపాడాలని వారు కోరారు. ఈ విషయంపై రైతులు తహసీల్దార్‌తో మాట్లాడారని పేర్కొన్నారు.